సాక్షి
సంగారెడ్డి
శనివారం । 29 । జూలై । 2023



అప్రమత్తతతోనే ఆరోగ్య రక్ష

వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డెంగీ, మెదడువాపు, మలేరియా జ్వరం, బోద కాలు వంటి వ్యాధుల నియంత్రణ కోసం దోమతెర, జాలీలు వాడాల్సి ఉంటుంది. 8లో



పండ్ల తోటలకు రాయితీ

ఆరోగ్య సంరక్షణ, రోగ నిరోధకశక్తి పెరగాలంటే ఆహారంలో పండ్లు తప్పనిసరి. దీంతో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించేందుకు ముందుకు వచ్చింది. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెక్నీషియన్ మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య నిర్వహణతో వ్యాధులకు చెక్

- జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



పుల్‌కల్ ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ ఎల్లయ్య

పుల్‌కల్(అందోల్): వరద సమస్యలను ఎదుర్కోడానికి పంచాయతీ రాజ్ సిబ్బందిని అప్రమత్తం చేశామని జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం పుల్‌కల్ మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రజలు వ్యాధులకు గురికాకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వపరంగా వరద సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించామని తెలిపారు. అత్యవసర సేవల కోసం ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. కుంటలు, చెరువులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పనులపై ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకాంత్ గౌడ్‌కు సూచనలు చేశారు.

ఎంపీ వ్యాఖ్యలపై భగ్గు



ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలు చేయడం తగదని గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ మాట్లాడుతూ ఎంపీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ఎంపీ పదవికి రాజీనామ చేయాలన్నారు. అనంతరం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉత్పత్తి రంగాల అభివృద్ధికి రుణాలు



మాట్లాడుతున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాశ రావు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉత్పత్తి రంగాల అభివృద్ధికి ఎస్‌బీఐ విరివిగా రుణాలు అందిస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దాపూర్ శివారు రైతువేదికలో ఎస్‌బీఐ సదాశివపేట ఏసీబీ మేనేజర్ నాగేందర్ ఆధ్వర్యంలో «సంధ్య శిబిరం» ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ఎస్‌బీఐ సేవలు, అమలు చేస్తున్న పథకాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. రైతులు నూరుశాతం పంట రుణాలు తీసుకోవాలన్నదే ఎస్‌బీఐ ధ్యేయమన్నారు. తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ మురళి కృష్ణ, నాగేందర్, ఏపీఎం నర్సింలు పాల్గొన్నారు.

బతికున్నా రేషన్‌కార్డు తొలగింపు



అధికారికి వినతిపత్రం ఇస్తున్న తండావాసి

నారాయణఖేడ్: బతికుండగానే తాను మృతి చెందినట్లు రేషన్ డీలర్ నిర్ధారించి కార్డును రద్దు చేయించారని ఓ వృద్ధురాలు వాపోయింది. తనకు న్యాయం చేయాలని శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ పరిధి మన్యానాయక్ తండాకు చెందిన కర్ర లచ్చిబాయి (70) తహసీల్దార్ కార్యాలయంలో తండావాసి ద్వారా వినతి పత్రం అందజేసింది. 20 ఏళ్ల కిందట తనకు ప్రభుత్వం అంత్యోదయ కార్డును మంజూరు చేసిందని తెలిపింది. రేషన్ సరుకులపైనే ఆధారపడి జీవిస్తుండగా ఏడాది కిందట అధికారులకు తాను మృతిచెందినట్లు రేషన్ డీలర్ జీవన్ తప్పుడు సమాచారం ఇచ్చి రేషన్ కార్డు రద్దు చేయించాడని ఆరోపించింది.



మర్వెల్లిలోని పత్తి పంటలో భారీగా నిలిచిన వర్షపు నీరు

పంటలన్నీ నీటిలోనే..

భారీ వర్షాలతో పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. శుక్రవారం కాసింత తెరిపినిచ్చినా వట్‌పల్లి మండలంలోని పొలాల్లో నీరు అలాగే ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దెబ్బతినే ప్రమాదం ఉండటంతో నీటిని బయటకు పంపించి పంటను కాపాడుకునే పనిలో ఉన్నారు. – వట్‌పల్లి(అందోల్)

జ్వర పీడిత ప్రాంతాల గుర్తింపు

- వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్: వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు టెలీకాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వర పీడిత ప్రాంతాలను గుర్తించాలన్నారు. వర్షాలకు త్వరగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇందుకు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యదర్శులు ఉదయం 7 గంటలలోపు గ్రామ పంచాయతీల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఆదివారం డ్రైడే పాటించాలని సూచించారు. ఉదయం 10 గంటలకు 10 నిమిషాలపాటు ఇంటిలో, ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని, చెత్తను తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అధికారులు పాల్గొనాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గాయత్రీ దేవి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీపీఓ సురేశ్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డీఎల్పీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. పచ్చిమిర్చి కొనకముందే ఘాటెక్కిస్తుండగా.. టమాటా వండకుండానే కుతకుత మంటోంది. ఏ కూరగాయలు కొనాలన్నా రూ.వందకు తక్కువ పలకడంలేదు. కిలో కొనేవారు పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. రూ.500 తీసుకెళ్తే సంచి కూడా నిండటంలేదని వినియోగదారులు వాపోతున్నారు. కొందరు పేదలు పప్పుచారుతోనే కాలం వెళ్లదీస్తున్నారు. మరోవైపు కురుస్తున్న వర్షాలకు పంటలన్నీ దెబ్బతినడం.. దిగుబడులు తగ్గడం కూడా ధరలు పెరిగేందుకు కారణమవుతోంది.



ధరల దడ!



దొండ చేనులో నిలిచిన వర్షం నీరు

- కొనకముందే కూరలు కుతకుత
- రూ.160 చేరిన టామాటా
- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- ఏది ముట్టుకున్నా రూ.వందపైనే
- దిగుబడి లేకే పెరిగిన రేట్లు
- వర్షాలకు దెబ్బతిన్న పంటలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఏటా సుమారు 20 వేల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుండగా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి మార్కెట్‌కు ప్రతి రోజు కూరగాయలు వస్తుంటాయి. వర్షాల ప్రభావం కూరగాయాల సాగుపై పడింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి తగ్గడం, ఈ ప్రాంతంలో పంట దిగుబడి పడిపోవడం వల్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు టమాటా, బెండకాయ, చిక్కుడు, గోరు చిక్కుడుతో పాటు ఆకు కూరలు సాగు చేస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి క్యాబేజీ, క్యాలిఫ్లవర్, ఉల్లిగడ్డ, వెల్లుల్లి, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ, టమాటా పట్టణ మార్కెట్‌కు వస్తుంటాయి.

ఏది ముట్టుకున్నా..

ప్రస్తుతం జోరుగా వర్షాలు కురుస్తుండటం వల్ల పంటల దిగుబడి పడిపోయింది. దీంతో రైతులు నష్టపోగా వినియోగదారులకు అధిక భారమవుతుంది. అల్లం, వెల్లుల్లి దిగుబడులు తగ్గడం వల్ల వాటి ధేటు కూడా పెరిగింది. టమాటా ధరలు దిగిరావడంలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా, పచ్చిమిర్చి కిలో రూ.160 వరకు పలుకుతోంది. ఆకు కూరలు తప్ప మిగతా కూరగాయల ధరలు కిలో రూ.100 తక్కువ లేవు. అల్లం, వెల్లుల్లి కిలో రూ.200కు చేరుకుంది.బీర్నిస్, బీరకాయ, క్యాప్సికం, చిక్కుడు తదితర కూరగాయలు కిలో రూ.80 తక్కువ పలకడంలేదు.

దిగుబడి తగ్గడం వల్లే..



డిమాండ్‌కు తగ్గ పంటల దిగుబడి లేదు. వర్షాలకు దెబ్బతిన్నాయి. టమాటా మొక్కలు కుళ్లిపోతున్నాయి. మిగతా కూరగాయల పరిస్థితి కూడా అలాగే ఉంది. దిగుబడి తగ్గిన ప్రతిసారి డిమాండ్ ఉంటుంది. ప్రణాళిక ప్రకారం కూరగాయల సాగు చేసినట్లయితే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. – శ్రీనివాస్ రైతు, జహీరాబాద్

కొనలేకపోతున్నాం



ఎన్నడూ లేనంతగా కూరగాయల ధరలు మండుతున్నాయి. ధరల ప్రభావం వల్ల కూరగాయలను కొనలేకపోతున్నాం. ఏది కొనాలన్న రూ.100 తక్కువ పలకడం లేదు. వారంతపు సంతలో కూడా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కిలోకు బదులు పావుకిలోతోనే సరిపెట్టుకుంటున్నాం. –రఘు, ఆదర్శనగర్ కాలనీ, జహీరాబాద్

‘తొలి ఉషస్సు’ కవిత్వానికి ప్రశంస



తొలి ఉషస్సు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ గ్రామానికి చెందిన చిన్నపట్ల హరిప్రియ రచించిన తొలి ఉషస్సు కవితా సంపుటికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 27వ తేదీన హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా తొలి ఉషస్సు కవితా సంపుటిని ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు కెవి రమణచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవయిత్రి హరిప్రియను పలువురు అభినందించి సత్కరించారు. హరిప్రియ సిటీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. చదువులో రాణిస్తూనే మరోవైపు సాహిత్యంలో ప్రతిభ కనబరుస్తోంది. ఆమె రచించిన కవిత్వానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడంపై తల్లిదండ్రులు,స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ధైర్యంగా ఉండండి



ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్

పలువురి పరామర్శ

పటాన్‌చెరు టౌన్: కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలోఉన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని రాజకీయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పరామర్శిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే తౌటి నందీశ్వర్ గౌడ్, తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ భానుప్రసాద్ రావు, పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్ మోహన్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం ఎమ్మెల్యేని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్



మాట్లాడుతున్న కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారిని క్రమబద్ధీకరించి సమ్మె విరమింపజేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.అనిల్, రైతు సంఘం మండల కార్యదర్శి టి.భూషణం ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. వారికి సంఘీభావంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 23 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. కార్మికులకు ఇచ్చే రూ.8500లతో కుటుంబాలను ఎలా పోషిస్తారని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు రైతుబంధు

వట్‌పల్లి(అందోల్): దళిత బంధుకు లబ్ధిదారులు దళారులను ఆశ్రయించకూడదని రాష్ట్ర జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు, అందోల్ జెడ్పీటీసీ ఖదీరాబాద్ రమేశ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దళిత బంధు పథకం ఎంపికలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేదిలేదన్నారు. అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఎంపిక ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తే అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. విడతల వారీగా రైతుబంధు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దళితబంధు లబ్ధిదారుల యూనిట్‌ల పర్యవేక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

సబ్సిడీపై ఆయిల్ పామ్ మొక్కలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింగరావు



రైతులతో మాట్లాడుతున్న నర్సింగరావు

మనూరు(నారాయణఖేడ్): భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి నర్సింగరావు శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి రైతులు తమ పంటలను రక్షించుకోవాలన్నారు. మండల పరిధిలోని మాయికోడ్‌లో సాగుచేస్తున్న పత్తి, మినుము, పెసర పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుచేయాలని ఆసక్తి ఉన్న రైతులకు సబ్సీడీపై పామాయిల్ మొక్కలను అందిస్తామన్నారు. 20 నుంచి 30 ఎకరాల సాగుకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలను వేసుకుంటే చెట్లను అందజేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుబీమాకు జూన్ 15 వరకు పట్టాదార్ పాసుబుక్స్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 15 వరకు అవకాశం ఉందన్నారు. అంతకు ముందు మాయికోడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ సంగమేశ్వర్, సర్పంచ్ అనిత సుధాకర్, ఎంపీటీసీ శంకరమ్మ, స్థానిక రైతులు ఉన్నారు.

నాణ్యత డొల్ల.. అభివృద్ధి కల్ల



కల్వకుంట ప్రధాన రహదారిలో దస్సు, కంకరతో నిర్మిస్తున్న మురికి కాలువ

- మూణ్నాళ్ల ముచ్చటగా పనులు
- రూ.కోట్లు వెచ్చిస్తున్నా తీరని వెతలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ: మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రూ.కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా నాణ్యత లోపిస్తుండటంతో కొద్ది కాలానికే అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. పనులు చేపడుతున్న వేళ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి పట్టణంలో 38 వార్డులున్నాయి. వార్డుకు రూ.కోటికిపైగా నిధులు కేటాయించి సీసీరోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్ల పనులు చేపడుతున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

అభివృద్ధి పనుల్లో నిబంధనలు ఎక్కడా కానరావడంలేదు. కంకర, డస్టు తోనే పనులు చేపడుతున్నారు. సమపాళ్లలో సిమెంట్ కలపడంలేదని, అసలు ఇసుకనే వాడటంలేదని ఆయా కాలనీ వాసులు తెలిపారు. అలాగే క్యూరింగ్ కూడా సరిగ్గా చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతుండటంతో ఆరు నెలల్లోపే పాడై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం కాంట్రాక్టర్లు ఇచ్చే ముడుపులకు ఆశపడి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు ఆపేస్తాం. గతంలో కూడా కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు చేయలేదు. ఇష్టారాజ్యంగా పనులు చేపడితే మా దృష్టికి తీసుకురావాలి. వారిపై చర్యలు తీసుకుంటాం. పనులను సైతం నిరంతరం పర్యవేక్షిస్తాం.
– ఇంతియాజ్, డీఈ, సంగారెడ్డి మున్సిపాలిటీ

క్లుప్తంగా

మద్యంమైకంలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


నర్సింలు మృతదేహం

కొండాపూర్(సంగారెడ్డి): తాగిన మైకంలో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలపరిధిలోని అనంతసాగర్‌లో శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. అనంతసాగర్‌కు చెందిన బంగారి నర్సింలు (59) పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. కొన్ని రోజులుగా పూర్తిగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం మధ్యాహ్నం మద్యం తాగొచ్చి ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బంగారి జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



కంది(సంగారెడ్డి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ ఎస్‌ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం .. ఈనెల 24న కంది పరిధిలో జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆపస్మారక స్థితిలో ఉండగా 108లో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుర్తుతెలి యని వ్యక్తి ఈనెల 27న మరణించాడు. కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ ఫి ర్యా దు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు వ్యక్తి ..

కొండాపూర్(సంగారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన మందుల మల్లేశం (32), అతడి సోదరుడితోపాటు మరికొందరు గ్రామశివారులో గల చౌదరి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మల్లేశం చెరువులో పడిపోయాడు. అతడి కోసం గురువారం రాత్రి వరకు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మృతదేహం బయటపడింది. మృతుడి సోదరుడు మందుల రాముల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోర్ల నుంచి ఉబికి వస్తున్న నీరు

జహీరాబాద్: భారీగా కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో బోర్ల నుంచి నీరు ఉబికి వస్తోంది. మొగుడంపల్లి మండలం ధనాసిరి గ్రామంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీరు బయటకు వస్తోంది. మోటారు సహాయం లేకుండానే కేసింగ్ పైపుల్లోంచి నీరు బయటకు వస్తోంది. అధికంగా వర్షాలు కురవడం వల్లే ఇందుకు కారణమని రైతులు తెలిపారు. పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో సైతం పలు బోర్లలో నీరు ఉబికి వస్తోంది.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

సంగారెడ్డి టౌన్: వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్లోని తన ఇంటి నుంచి బాలుడు బయటికి వెళ్తుండగా కుక్కల సమూహం దాడి చేసింది. ఈ దాడిలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన ఓ మహిళ వెంటనే వాటిని తరమడంతో సురక్షితంగా బయటపడ్డాడు.



అప్రమత్తతతోనే ఆరోగ్య రక్ష

- సీజనల్ వ్యాధులతో ప్రజలు జరభద్రం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డెంగీ, మెదడువాపు, మలేరియా జ్వరం, బోదకాలు వంటి వ్యాధుల నియంత్రణ కోసం దోమతెర, జాలీలు వాడాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నుంచి బయట పడతారని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై కథనం..

హత్నూర(సంగారెడ్డి): కూలెక్స్ దోమ వల్ల మెదడు వాపు వ్యాధి వస్తోంది. దోమ కుట్టిన పది రోజులలోపు లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా 1 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే అవకాశముంది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అసాధారణంగా కళ్లు తిరుగుతాయి. పక్షవాతానికి గురయ్యే ప్రమాదముంది. వాంతులు, విరేచనాలు అవుతాయి. కొన్నిసార్లు ఫిట్స్ కూడా రావచ్చు.

జాగ్రత్తలిలా..
దోమ తెర వాడాలి. ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులు, సన్నటి జాలీలు బిగించుకోవాలి. జనావాస మధ్యన పందులు సంచరించకుండా చూసుకోవాలి. మురుగు గుంతలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వకుండా చూడాలి. నిల్వ ఉంటే కిరోసిన్, ఇంజిన్ ఆయిల్ పోయాలి. సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు దోమ తెర, గుడ్డ లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.

డెంగీ లక్షణాలు
ఏడిస్ ఈజిప్టి వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతోంది. దోమ కుట్టిన తర్వాత 5 నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తోంది. తలనొప్పి అధికమవుతోంది. కంటి కదలికల సమయంలో భరించలేని నొప్పి ఉంటోంది. కండరాలు, కీళ్ల నొప్పులతోపాటు వాంతులు అయినట్లుగా ఉంటోంది. నోరు ఎండిపోవడం, అధిక దాహం, ఒళ్లు నొప్పులు, శరీరంపై ఎర్రటి దురదలు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు
డెంగీ దోమ పగటి పూట మాత్రమే కుడుతోంది. ఉదయం సమయంలో జాగ్రత్తగా ఉండాలి. పూలకుండీలు, ఎయిర్ కూలర్లు, నీటి నిల్వ తొట్లు, గొట్టాలు, నిల్వ ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్త తీసుకోవాలి. సాక్సులు, బూట్లు, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండేలా ప్యాంట్లు, షర్టులు ధరించాలి. దోమలు కుట్టకుండా, లేపనాలు రాసుకోవాలి. పగటి పూట కూడా దోమ తెర వాడాలి.

మలేరియా లక్షణాలు
సాయంత్రం పూట విడవకుండా జ్వరం రావడం, చలి వణుకు ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి చికిత్స చేయించాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి. అప్పటి వరకు వేచి చూస్తే మలేరియా మరింత తీవ్రమయ్యే అవకాశముంది. రోగ కారణాలు మెదడు మీద ప్రభావం చూపితే సెరిబ్రల్ మలేరియాకు దారితీసే అవకాశముంది .ఇది ప్రాణాంతకం, ముఖ్యంగా చిన్నారులు సెరిబ్రల్ మలేరియా బారిన పడే అవకాశం ఉంది.

జాగ్రత్తలు
దోమ కాటుకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రతి నీటి తొట్టిలూ ప్రతి మూడు రోజులకోసారీ ఖాళీ చేసి మళ్లీ తాజా నీటిని నింపుకోవాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరిబోండాలు వాడి పడేసిన టైర్లు ఉంచకూడదు. ఇంట్లో కూలర్లలో నీటిని ప్రతి మూడు రోజులకోసారీ మార్చుకోవాలి.

చికెన్ గున్యా లక్షణాలు
చికెన్ గున్యా జ్వరం పగటి పూట కుట్టే పులి దోమ ద్వారా వస్తోంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్ల నొప్పులు, వాపులు, నేలపై నుంచి లేచేందుకు వీలులేని విధంగా శరీరమంతా నొప్పులుంటాయి.

జాగ్రత్తలు..
భరించలేని ఒళ్లు, కీళ్ల నొప్పులు, జలుబుతో బాధపడేవారు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఎప్పటికప్పుడూ వాటిని వేడి నీటితో శుభ్రపరచాలి. ఇంటి పరిసరాలు శుభ్రం చేయాలి. దోమతెరలు వాడుతూ, డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నిల్వ ఆహారం తినొద్దు.

బోదకాలు లక్షణాలు
తరచూ కొద్దిపాటి జ్వరం, ఆయాసం బోదకాలు ప్రాథమిక లక్షణాలు. పురుషులలో వరి బీజం ఏర్పడుతోంది. గజ్జల్లో వాపు వస్తోంది. నిర్ధారణకు రాత్రి సమయంలో రక్త నమూనాలు సేకరిస్తారు. బాధితుడు విశ్రాంతి సమయంలో పరాన్న జీవులు రక్త ప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశిస్తాయి. 5 నెలల్లో ప్రౌఢ జీవులుగా వృద్ధి చెందుతాయి. ఇలా శరీరంలో 6 ఏళ్ల పాటు జీవించే ఈ పరాన్న జీవులు లక్షల సంఖ్యలో ఉత్పత్తయి శోషణ వ్యవస్థలోకి చేరతాయి. దీంతో శరీర అవయవాలు అసాధారణ వాపునకు గురవుతాయి.

జాగ్రత్తలు...
నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఈ మాత్రల ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోంది.

పరిశుభ్రం ముఖ్యం



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్ వేప రేజర్ల కన్నా దోమ తెరలు విని యోగిస్తే ఫలితం ఉంటుంది. ముఖ్యంగా పరిసరాలతోపాటు వ్యక్తిగతంగానూ పరిశుభ్రంగా ఉండాలి.
– శంకర్, దౌల్తాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి

ఆచూకీ తెలిపితే నగదు

- ఇటీవల ఇంటి నుంచి వెళ్లిన వైనం


మనీషాకుమారి

హత్నూర,(సంగారెడ్డి) : నాలుగు రోజుల క్రితం బాలిక ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం కాగా, ఆచూకీ తెలిపిన వారికి నజరానా ఇస్తామని జిన్నారం సీఐ వేణు కుమార్ శుక్రవారం ప్రకటించారు. ఆయన కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం సమస్తీపూర్ జిల్లా పులహారానికి చెందిన సత్యకుమారి, శత్రుధన్ ముఖియా భార్యాభర్తలు. 6 నెలలుగా మండలంలోని మల్కాపూర్‌లో నివాసం ఉంటున్నారు. సత్యకుమారి సోదరి మనీషా కుమారి (11) 2 నెలలుగా ఆమె వద్దే ఉంటోంది. ఈనెల 25న మనీషా కుమారి తెల్లవారుజాము ఇంటో నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక బిహారీ, హిందీ మాత్రమే మాట్లాడగలదు. ఆమె ఆచూకీ తెలిస్తే 87126 56752, 87126 56730, 91775 15983 నంబర్లకు గానీ డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని, 5 వేల నజనారా అందిస్తామని సీఐ వేణు కుమార్, ఎస్‌ఐ సుభాష్ ప్రకటించారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరి మృతి

- పలువురికి గాయాలు, క్షతగాత్రుల్లో చిన్నారులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆటో, బైక్ ఢీకొని ఆటోడ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మాచనూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్‌కు చెందిన ముజీబ్(30) ఆటో నడుపుకుని జీవించేవాడు. శుక్రవారం ఆటోలో ప్రయాణికులతో జహీరాబాద్ వైపు నుంచి ఝరాసంగం మీదుగా రాయికోడ్‌కు బయలుదేరాడు. ఓ వ్యక్తి బైక్‌పై ఝరాసంగం నుంచి జహీరాబాద్ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో మాచనూర్ గ్రామ శివారులో ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ముజీబ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో ప్రయాణికులు తమ్మలి వీరన్న, పాషామియా, మల్లేష్, కావేరి, చిన్నారులు అభిషేక్, చందులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులంతా జహీరాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రితోపాటు ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా ద్విచక్ర వాహనదారుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు జావిద్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని ముంచెత్తిన వరద


సిద్దేశ్వర ఆలయం చుట్టూ నిలిచిన నీరు

గర్భగుడిలోకి చేరిన నీరు

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాల వల్ల సిద్దేశ్వర స్వామి దేవాలయాన్ని వరద ముంచెత్తింది. గర్భగుడిలోకి నీరు చేరింది. ప్రతిసారి వరదలు చుట్టుముడుతున్నా నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. పూజారులు గుడిలోకి వచ్చిన నీటిని ఎత్తి పోస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆలయ పక్క నుంచి వాగు ప్రవహిస్తుంది. వాగుకు వరద పోటెత్తడంతో ఈ దుస్థితి నెలకొంటోంది. పట్టణంలోని వరద అంతా ఈ వాగు గుండానే వెళ్తోంది. అయితే బైపాస్ రోడ్డు నిర్మాణం, ఆలయం ముందు భాగంలో వెంచర్ వెలియడంతో వరద నీరు సాఫీగా వెళ్లకుండా వెనక్కి వస్తోంది. దీంతో ఆలయం చుట్టూ వరద చేరుకుంటోంది. ఇప్పటికైనా ఈఓ మోహన్‌రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

- డీఎల్పీఓ సతీశ్

హత్నూర (సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎల్పీఓ సతీశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దౌల్తాబాద్ గ్రామ పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు చూసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ వెంకటేశం, గ్రామ కార్యదర్శి బాలరాజ్ ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం

కొండాపూర్(సంగారెడ్డి): కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, కార్మికుల హక్కుల పరిరక్షణ సౌకర్యాల సాధన కోసం సంఘటిత పోరాటాలే శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి మల్లేశం పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో శుక్రవారం సీఐటీయూ నాయకత్వ జిల్లా స్థాయి తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులు మూడు రోజులపాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సరళీకరణ ఆర్థిక విధానాల అమలులో భాగంగా కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు మార్పుచేసి ఏకపక్షంగా ఆమోదించిందన్నారు. పార్లమెంట్‌లో కనీస చర్చ కూడా జరపలేదన్నారు. ప్రతిపక్షాలు నిరసన తెలిపినా అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆమోదించాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

సోయంపై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వ్యాఖ్యానించిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై తక్షణం చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాటసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నారాయణఖేడ్‌లో సోయం బాబురావు శవయాత్ర నిర్వహించి రాజీవ్ చౌక్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాథోడ్ మాట్లాడుతూ బాపురావుపై పీడీ యాక్టు, రాజద్రోహం కేసు నమోదు చేయాలన్నారు. మణిపూర్‌లో మాదిరి ఇక్కడ కూడా గొడవలు సృష్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా సురేశ్ నాయక్, ఉపాధ్యక్షులు రామోజీ, సురేష్, మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాల్సిందే

కొండాపూర్ (సంగారెడ్డి): పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. కార్మికులు 23 రోజులుగా సమ్మె చేస్తున్నా కేసీఆర్ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ ప్రకారం రూ.19,500 వేతనం ఇవ్వాలన్నారు. అదేవిధంగా మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినాన్ని అమలు చేసి, వారాంతపు సెలవులు, పండుగలు, జాతీయ అర్జిత సెలవులు అమలు చేయాలన్నారు.

సంకల్ప రథయాత్రకు మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి): పాత పెన్షన్ సాధనకు శనివారం సంగారెడ్డిలో నిర్వహించే సంకల్ప రథయాత్రకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్తి మద్దతు ఉంటుందని జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ శుక్రవారం తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ శనివారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి మల్కాపూర్ చౌరస్తాలోని హైదరాబాద్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సభకు టీపీటీఎఫ్ శ్రేణులు హాజరవ్వాలని కోరారు.

జైనులకు మైనార్టీ స్టేటస్ సర్టిఫికెట్లు

వట్‌పల్లి(అందోల్): /సంగారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జైనమతాన్ని మైనార్టీ మతంగా గుర్తించినందున జైనులకు మైనారిటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని జిల్లా జైన్ మైనారిటీ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డి డీఆర్‌ఓ నగేశ్‌కు జిల్లా జైన్ మైనారిటీ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. జైనులకు రాయితీలు, రుణాల మంజూరుకు సహకరించాలని, సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలన్నారు.

కల్తీ కల్లేనా?

- కలుషిత నీరుపైనా అనుమానం?
- మిస్టరీ తేల్చేపనిలో మూడు శాఖల అధికారులు
- తాజాగా వృద్ధుడి మృతి
- దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న 61 మంది
- శాంపిల్స్ సేకరణ
- ఐపీఎం రిపోర్టుకు వారం సమయం
- దుబ్బాక ఘటనపై ప్రభుత్వం సీరియస్


దుబ్బాక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


నర్లెంగడ్డలో మిషన్ భగీరథ అధికారులు


కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సాక్షి, సిద్దిపేట దుబ్బాక ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. వాంతులు, విరేచనాలు ఏ కారణంతో జరిగాయి? వృద్ధుడు ఎలా మృతిచెందాడు? అనే ప్రశ్నల చిక్కుముడి విప్పడానికి 3 శాఖల అధికారులు రంగంలోకి దించింది. కల్తీ కల్లునా? కలుషిత నీరు తాగి మృతిచెందాడా? పలువురు ఎందుకు అస్వస్థతకు గురయ్యారా? అని నిర్ధారించే పనిలో నిమగ్నమయ్యారు.

దుబ్బాక మండలం దుంపలపల్లి, బల్వంతపూర్, నర్లెంగడ్డ, పద్మశాలి గడ్డ గ్రామాలకు చెందిన వారు కూలీ పనులకు వెళ్లి వస్తున్న క్రమంలో కల్లు తాగారు. గురువారం తెల్లవారుజాము నుంచి వారికి వాంతులు, విరేచనాలై అస్వస్థతకు గురయ్యారు. 33 మందికి పైగా దుబ్బాకలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 28 మంది ఇంటి వద్దే మందులు వాడుతున్నారు. శుక్రవారం ఉదయం పద్మశాలి గడ్డకు చెందిన కుంటయ్య (65) మృతిచెందాడు.

భిన్నాభిప్రాయాలు
కల్లు వల్లే వాంతులు, విరేచనాలు అయ్యాయని కొందరు పేర్కొంటుండగా, మరికొందరు కలుషిత నీరే కారణమని కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. వర్షాలతో కల్లు విక్రయ కేంద్రాలలో అమ్మకాలు లేక నిల్వను విక్రయించడంతోనే అస్వస్థతకు కారణమా? అన్నది తేలాల్సి ఉంది. కల్తీ కల్లుతోనే వాంతులు, విరేచనాలు అయ్యాయని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు.

శాంపిల్స్ సేకరణ
ఎందువల్ల అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించేందుకు ఎక్సైజ్ శాఖ, మిషన్ భగీరథ, వైద్యారోగ్య శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్సైజ్ అధికారులు దుంపలపల్లి, బల్వంతపూర్, నర్లెంగడ్డలలోని కల్లు విక్రయ కేంద్రాల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించారు. మిషన్ భగీరథ అధికారులు ఆయా గ్రామాల్లో సరఫరా అయిన నీటిని శాంపిల్స్ సేకరించారు. వైద్య అధికారులు 10 మంది నుంచి బ్లడ్, స్టూల్, మూత్రం శాంపిల్స్ తీసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంట్ మెడిసిన్ ల్యాబ్ (ఐపీఎం)కు పంపించారు. కల్తీ కల్లు తాగడంతో వృద్ధుడు మృతిచెందాడా? బాధితులు తాగు నీటితో వాంతులు, విరేచనాలయ్యాయా? అన్నది తేలాలంటే రిపోర్టు రావాల్సిందే.

వాటర్ వల్ల కాదు

గజ్వేల్ నుంచి 450 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నాం. మధ్యలో ఎక్కడా సైతం లీకేజీలు సైతం లేవు. నీరు కలుషితమయ్యే అవకాశమే లేదు. నీరయితే ఇంట్లో వారందరూ అస్వస్థతకు గురి కావాలి. కేవలం కొందరే అస్వస్థతకు అయ్యారు. గ్రామాల్లో సేకరించిన వాటర్ శాంపిల్స్ రిపోర్ట్ శనివారం రానుంది.
– గిరిధర్, ఈఈ, మిషన్ భగీరథ

కల్లు శాంపిల్స్ సేకరించాం

ఆయా గ్రామాల్లో విక్రయిస్తున్న కల్లు శాంపిల్స్ సేకరించాం. కోర్టు ద్వారా నిజామాబాద్‌లోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపిస్తాం . వారం రోజుల్లో రిపోర్టు రానుంది.
– శ్రీనివాస మూర్తి, ఈఎస్